# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ఈ రోజుతో ముగియనుంది.**
2. **లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా భారతీయ జనతాపార్టీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు తెలుగు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు.**
3. **దేశవ్యాప్తంగా ఐ.ఐ.టీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు.**
4. **రెండు తెలుగు రాష్ట్రాల్లో 40 నుంచి 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.**
5. **ఈరోజు ప్రపంచ మలేరియా నివారణా దినాన్ని నిర్వహిస్తున్నారు.**

==============================

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో లోక్‌సభ, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ఈ రోజుతో ముగియనుంది. ఒకరోజు గడువు ఉండగానే బుధవారం వరకు ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీకి 3 వేల 644, లోక్‌సభకు 654 నామినేషన్లు దాఖలయ్యాయి. నిన్న ఒక్కరోజే అసెంబ్లీకి ఒక వెయ్యి 294, లోక్‌సభకు 237 నామినేషన్లు దాఖలయ్యాయి.

---------------------------

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ జిల్లా పులివెందుల శాసనసభ అభ్యర్థిగా ఈ రోజు నామినేషన దాఖలు చేయనున్నారు. ఆయన తరఫున ఇప్పటికే ఒక సెట్ నామినేషన్ దాఖలుకాగా.. జగన్మోహన్ రెడ్డి స్వయంగా ఈ ఉదయం 11 గంటల 25 నిమిషాల నుంచి 11 గంటల 40 నిమిషాల మధ్య రిటర్నింగ్ అధికారికి నామినేషన పత్రాన్ని అందజేస్తారు. తొలుత పులివెందుల భాకరాపురంలో జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. అనంతరం ఉదయం 11 గంటల 25 నిమిషాలకు పులివెందుల మినీ సెక్రటేరియేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకుని జగన్మోహన్ రెడ్డి నామినేషన్ పత్రాలు సమర్పిస్తారు.

---------------------------

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా భారతీయ జనతాపార్టీ సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు తెలుగు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. రెండు రాష్ట్రాల్లోనూ వచ్చే నెల 13వ తేదీన పోలింగ్ జరగనుంది.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఎన్నికల ప్రచారం నిర్వహించాలని నరేంద్ర మోదీని రెండు రాష్ట్రాల నేతలు ఆహ్వానించారు. వచ్చే నెల మూడు, నాలుగు తేదీల్లో ఆయన ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తారని బీజేపీ రాష్ట్ర కార్యాలయం తెలిపింది. అటు తెలంగాణలోనూ ఆయన పర్యటన ఖరారైందని ఆ పార్టీ ప్రకటించింది. ఈ నెల 30వ తేదీ అందోల్ నియోజకవర్గంలో జరిగే సభకు ప్రధానమంత్రి హాజరు కానున్నారు. అదే రోజు సాయంత్రం శేరిలింగంపల్లిలో ఐటీ ఉద్యోగులతో ఆయన సమావేశమవుతారు. మే 3వ తేదీన వరంగల్ లోక్‌సభ పరిధిలో నిర్వహించే సభలో పాల్గొంటారు. అనంతరం భువనగిరి, నల్గొండ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసే సభలకూ నరేంద్ర మోదీ హాజరవుతారు. మే 4వ తేదీ నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో నిర్వహించే సభల్లో పాల్గొంటారు.

---------------------------

తెలంగాణాలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరిగే మే 13 వ తేదీన వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తూ ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని తమ సొంత ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆయా ప్రాంతాలకు వెళ్లే వారికి కూడా వేతనంతో కూడిన సెలవు ఇవ్వాల్సిందేనని అందులో స్పష్టం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిని గెలిపించి అభివృద్ధిని స్వాగతించాలని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో నిన్న జరిగిన మేధావుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 100 బిలియన్ డాలర్ల ప్రాజెక్టులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి వెన్నెముక లాంటి 465 కిలోమీటర్ల ఈస్ట్–వెస్ట్ ఎకనామిక్ కారిడార్ తీసుకు వస్తామని హామీ ఇచ్చారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్‌దారులకు మే నెల పింఛను వారి ఇంటి వద్దే ఇచ్చే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘానికి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన రాసిన లేఖను ఆ పార్టీ నేత కనకమేడల రవీంద్ర కుమార్ ఎన్నికల సంఘానికి అందజేశారు. మే నెల పింఛన్ పంపిణీకి ఇంకా ఐదు రోజులే సమయం ఉందని.. గ్రామస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నందు వల్ల ఇంటింటికీ పింఛను పంపిణీని రెండు రోజుల్లో పూర్తిచేసే అవకాశం ఉందని చంద్రబాబునాయుడు సూచించారు. ఇంటి వద్దే పింఛను పంపిణీ జరుగుతుందన్న సమాచారాన్ని లబ్ధిదారులకు చేరవేయాలని ఎన్నికల సంఘాన్ని కోరారు.

---------------------------

దేశవ్యాప్తంగా ఐ.ఐ.టీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. దేశవ్యాప్తంగా 56 మందికి 100 పర్సంటైల్ రాగా.. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందినవారే 22 మంది ఉన్నారు. జేఈఈ మెయిన్స్ తుది ఫలితాలను జాతీయ పరీక్షల విభాగం – ఎన్. టీ. ఏ. బుధవారం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 2.5 లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేసింది. 100 పర్సంటైల్ సాధించినవారిలో తెలంగాణ నుంచి 15 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడుగురు ఉన్నారు.

---

రెండు తెలుగు రాష్ట్రాల్లో 40 నుంచి 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ తీవ్రతతో పాటు వడగాడ్పులు వీస్తున్నాయి. నిన్న ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా తుమ్మికపల్లిలో 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కడప జిల్లా బలపనూరులో 44.9 డిగ్రీలు, ప్రకాశం జిల్లా దొనకొండలో 44.3, నంద్యాల జిల్లా మహానందిలో 44.2, అనకాపల్లి జిల్లా రావికమతంలో 44.1, ఎన్టీఆర్ జిల్లా కంభంపాడు, పల్నాడు జిల్లా రావిపాడులో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 105 మండలాల్లో వడగాడ్పులు వీచగా, 69 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీచాయి. ఈ రోజు శ్రీకాకుళం. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని 54 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని, శ్రీకాకుళం నుంచి పల్నాడు వరకు 154 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ రోజు, రేపు 40 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది.

---

ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్‌గా కుమార్ విశ్వజిత్, విజయవాడ పోలీస్ కమిషనర్‌గా పీహెచ్‌డీ రామకృష్ణను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఈ పోస్టుల్లో ఉన్న ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులను ఎన్నికల సంఘం బదిలీ చేసింది. వీరి స్థానాల్లో వేరే అధికారులను నియమించేందుకు వీలుగా... ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున ఐపీఎస్ అధికారుల పేర్లతో ప్యానల్ సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డికి ఆదేశాలు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్యానెల్‌ను పరిశీలించిన అనంతరం ఎన్నికల సంఘం తుది నిర్ణయం తీసుకుంది. కొత్తగా నియమితులైన అధికారులు ఈ రోజు బాధ్యతలు చేపట్టాలని ఆదేశించింది.

---

ఈ రోజు ప్రపంచ మలేరియా నివారణా దినాన్ని నిర్వహిస్తున్నారు. మలేరియా వ్యాధి పట్ల ప్రజలలో అవగాహన కల్పించి... ఈ వ్యాధిని సమూలంగా నిర్మూలించే ఉద్దేశ్యంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ .....డబ్ల్యూ.హెచ్.ఓ. ...పిలుపు మేరకు 2008 వ సంవత్సరం నుండి ఈ కార్యక్రమం జరుగుతోంది. ఆఫ్రికాలోని నైజీరియా దేశ రాజధాని అబూజాలో 2001 ఏప్రిల్ 25వ తేదీన ఆఫ్రికన్ యూనియన్ దేశాలు సమావేశమై ....ఆరోగ్య రంగాన్ని మెరుగుపరిచేందుకు తమ వార్షిక బడ్జెట్‌లో కనీసం 15 శాతం మొత్తాన్ని కేటాయించాలని తీర్మానించాయి. ఏప్రిల్ 25 న జరిగిన ఆ తీర్మానాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

---

కరోనా కష్టకాలంలోనూ తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిలిపివేయలేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి వద్ద నిర్వహించిన మేమంతా సిద్ధం ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేర్చామని, 2 లక్షల 70 వేల కోట్ల రూపాయలు ప్రజలకు నేరుగా పంపిణీ చేశామని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీలను 99 శాతం నెరవేర్చామని అన్నారు.

---

ఉత్తరాంధ్రలోని ఏ ఒక్క ప్రాజెక్టునూ గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పూర్తి

చేయలేకపోయారని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు విమర్శించారు. జనసేన పార్టీ అధ్యక్షులు కె.పవన్ కల్యాణ్‌తో కలిసి ఆయన విజయనగరం జిల్లా డెంకాడ మండలం సింగవరం, విజయనగరం కలెక్టరేట్ వద్ద ప్రజాగళం–వారాహి యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.. సాగు, తాగునీరు లేక ఈ ప్రాంత ప్రజలు వలసలు వెళ్లిపోతున్నారని.. తమ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే తారకరామతీర్థ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి అక్కడ నుంచి సుజల స్రవంతి ద్వారా ఉత్తరాంధ్ర రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో తమ కూటమి గెలిస్తే వలసలను ఆపేందుకు చర్యలు తీసుకుంటామని, నెల్లిమర్ల జూట్ మిల్ తిరిగి తెరిపిస్తామని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు.

--------------------------

మద్యపాన నిషేధం చేస్తానని హామీ ఇచ్చి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆ తర్వాత మాట నిలుపుకోలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్.షర్మిల విమర్శించారు. న్యాయ న్యారు యాత్రలో భాగంగా నిన్న ఆమె బాపట్ల జిల్లా రేపల్లె, కృష్ణా జిల్లా పెడన, పామర్రులో రోడ్‌షో నిర్వహించారు.

======================